క్లుప్తంగా

చిన్నారులకు ప్లేట్ల పంపిణీ



చిట్కుల్ అంగన్‌వాడీ కేంద్రంలో కార్పెట్లు అందిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలోని రెండు అంగన్‌వాడీ చిన్నారులకు కాంగ్రెస్ నాయకుడు తారా విష్ణువర్ధన్‌రెడ్డి , బుధవారం తన పుట్టినరోజు సందర్భంగా ప్లేట్‌లు, పెన్సిల్ కిట్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు, పంచాయతీ కార్యాలయానికి కార్పెట్‌లు, పంచాయతీ కార్మికులకు టోపీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతి, మాజీ సర్పంచ్ భూమయ్య, మాజీ ఎంపీటీసీ ఆంజనేయులు గుప్తా, నాయకులు విఠల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బాగయ్య, ఆఖిల్, అంగన్‌వాడీ టీచర్లు శ్యామల, షహనాజ్ పాల్గొన్నారు.

తీరిన ట్రాన్స్ 'ఫార్మర్' కష్టాలు

పాపన్నపేట(మెదక్): విద్యుత్ నియంత్రణ మండల సలహా సభ్యులు శశిధర్‌రెడ్డి చొరవతో ఓ రైతు ఎనిమిది నెలల ఎదురుచూపులు ఫలించాయి. పాపన్నపేట మండలం బాచారం గ్రామానికి చెందిన నారాయణ వ్యవసాయ పొలం కోసం ట్రాన్స్‌ఫార్మర్ అవసరమైంది. 8 నెలల క్రితం డీడీ చెల్లించాడు. అయినా విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ బిగించలేరు. దీంతో పంటలు ఎండిపోయి నష్టపోయాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న శశిధర్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన విద్యుత్ నియంత్రణ మండలి సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అధికారులు బుధవారం వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు. రైతు మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

శిఖం భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు



గంగారంలో పత్తి కుంట శిఖంలో వేసిన రోడ్డును తొలగిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

చిలప్‌చెడ్(నర్సాపూర్): శిఖం భూములు, ప్రభుత్వ భూములను అక్రమంగా కబ్జా చర్యలు తప్పవని ఆర్ఐ సునీల్‌సింగ్ చౌహాన్ అన్నారు. ఈ నెల 2న ప్రచురితమైన రోడ్డు కోసం శిఖం భూమి కబ్జా అనే కథనానికి స్పందించిన రెవెన్యూ అధికారులు బుధవారం చర్యలు చేపట్టారు. మండల పరిధిలోని గంగారం గ్రామ శివారులోని పత్తికుంట శిఖం (సర్వే నంబర్ 157) భూమిలో నుంచి పట్టా భూమిలోకి రోడ్డు వేసిన విషయం విధితమే. స్పందించిన అధికారులు శిఖం భూమిలో నుంచి వేసిన రోడ్డును తొలగించారు. ఈ సందర్భంగా ఆర్ఐ సునీల్ సింగ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కబ్జా చేసి, అక్రమ నిర్మాణాలకు పాల్పడితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ రవిప్రసాద్ ఉన్నారు.

ఆందోళన చెందొద్దు

రామాయంపేట(మెదక్): విద్యార్థులు పరీక్షలు రాసేప్పుడు ఆందోళన చెందొద్దని, ప్రశాంతంగా ఉండాలని సత్యసాయి సేవా సమితి సభ్యులు సూచించారు. పట్టణంలో కస్తూర్బా, బాలికల రెసిడెన్సియల్ స్కూళ్లలో బుధవారం వారు పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేసి వారికి సబ్జెక్టులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, ఇతర ప్రతినిధులు శంకరయ్య, కోఆర్డినేటర్ రుక్మిణి, సభ్యులు ప్రసన్న, శేఖర్, పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహప్రతిష్ఠ



హోమంలో పాల్గొన్న భక్తులు

టేక్మాల్(మెదక్): మండలంలోని కాద్లూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గంగాదేవి ప్రతిష్ఠమహోత్సవం కొనసాగుతోంది. ఉత్సవంలో భాగంగా బుధవారం గణపతి పూజ, అవాహిత దేవతాపూజ, ప్రధాన హోమాలు, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ



చిట్కుల్ కేజీబీవీలో ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న ఎంఈఓ విఠల్

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాలలు సైతం వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. విద్యార్థి దశలో పదో తరగతి కీలకమైనది. ఉన్నత విద్యకు పదో తరగతి పునాదిలాంటిది. విద్యార్థులకు సరైన సూచనలిస్తే, పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు వస్తాయని ఉపాధ్యాయులు అన్నారు. చిలప్‌చెడ్ మండలంలో ఆరు ఉన్నత పాఠశాలలు, ఒక కేజీబీవీ ఉండగా, గత ఏడాది మండలంలోని అన్ని పాఠశాలల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాయి. ఈసారి వందశాతం సాధించే దిశగా ఉపాధ్యాయులతో పాటు, విద్యార్థులు శ్రమిస్తున్నారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతుండడంతో మండలంలోని ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ప్రణాళికతో బోధించడం మొదలుపెట్టారు. రోజుకో సబ్జెక్ట్ వారీగా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా గణితం, అంగ్లం, భౌతిక, రసాయన శాస్త్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. అదే విధంగా సబ్జెక్ట్‌లో వెనకబడిన విద్యార్థులపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థుల ఉన్నతమైన ఫలితాలు సాధించాలంటే తల్లిదండ్రుల సహకారం కూడా అవసరమన్నారు. ఉపాధ్యాయులు నిరంతరం టెస్టులు నిర్వహించడంతో విద్యార్థుల స్థాయి తమకు అర్థమవుతుందని, అదే విధంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, తద్వారా వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. అదే విధంగా విద్యార్థులు పరీక్షలు అయ్యేంతవరకు టీవీ, మొబైల్, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రస్తుతం సబ్జెక్ట్ వారీగా తరగతులు పూర్తి అయ్యాయని, పునశ్చరణ తరగతులు జరుగుతున్నాయన్నారు.

10 జీపీఏ సాధిస్తా..



ప్రస్తుతం పాఠశాలలో పునఃశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు నిర్వహించిన టెస్టుల్లో మంచి మార్కులు సాధించా. పదో తరగతిలో 10 జీపీఏ సాధించడమే లక్ష్యంగా చదువుతున్నా. మా తల్లిదండ్రులు కూడా ప్రోత్సాహం అందిస్తున్నారు.

– మంగలి హారిక, విద్యార్థి, చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాల

ప్రణాళికతో బోధన



ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికతో బోధిస్తున్నాం. సమయానుకూలంగా చదివిస్తున్నాం. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాం. విద్యార్థులకు ఒత్తిడి పెంచొద్దనే విషయంపై తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేశాం. నిరంతరం టెస్టులు నిర్వహిస్తున్నాం.

– మోహన్, ఉపాధ్యాయుడు, సోమక్కపేట్ ఉన్నత పాఠశాల

వందశాతం కోసం చర్యలు



మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం. అందుకు గానూ ప్రణాళికలు రూపొందించాం. పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహణపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ, విద్యార్థుల నైపుణ్యాలు పరిశీలిస్తున్నాం.

– విఠల్, ఎంఈఓ, చిలప్‌చెడ్

భుజిరంపేటలో పీఎంశ్రీ పాఠశాల ప్రారంభం



భుజిరంపేట పాఠశాలలో బోధన అభ్యాసన సామగ్రి పంపిణీ చేస్తున్న ఎంఈఓ బాలరాజు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని భుజిరంపేట ప్రాథమిక పాఠశాల పీఎంశ్రీ పాఠశాలగా ఎంపిక కావడంతో బుధవారం ఎంఈఓ బాలరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. మండలంలో కౌడిపల్లి ఉన్నత పాఠశాల, భుజిరంపేట ప్రాథమిక పాఠశాల పీఎంశ్రీ (ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం కింద ఎంపిక అయ్యాయని తెలిపారు. వీటికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తుందని చెప్పారు. భుజిరంపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతోపాటు ప్రీప్రైమరీ పిల్లలకు సైతం విద్యాబోధన చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బోధన అభ్యాసన సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నరేశ్, ఉపాధ్యాయులు మహేశ్, ప్రసాద్‌రావు, వేణుగోపాల్, మమత, సంధ్య, లతశ్రీ, పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

చిన్నశంకరంపేట(మెదక్): పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సహకరిస్తానని మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తెలిపారు. బుధవారం మండలంలోని రుద్రారం గ్రామ శివారులో నిర్మించిన శ్రీరాజ్ స్టీల్ పరిశ్రమను మైనంపల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన యజమాని కిషన్ అగర్వాల్‌తో మాట్లాడి స్థానికులకు 50 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పరిశ్రమ యజమాని కిషన్ అగర్వాల్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు లక్ష్మణ్, రాజిరెడ్డి, మాజీ ఎంపీపీలు అరుణ, గోపాల్‌రెడ్డి, శ్రీమాన్‌రెడ్డి పాల్గొన్నారు.

తునికి ఆలయం వద్ద వేలంపాట

రూ. 11.72లక్షల ఆదాయం



తునికి నల్లపోచమ్మదేవి ఆలయం వద్ద వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మదేవి ఆలయం వద్ద నాలుగు దుకాణాల వేలంపాట ద్వారా రూ. 11.72లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ రంగారావు తెలిపారు. దుకాణాల వేలం ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడగా, బుధవారం ఈఓ రంగారావు, పరిశీలకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేలంపాటను నిర్వహించారు. దీంతో 1వ దుకాణం చిన్న నర్సాగౌడ్ రూ. 3.15లక్షలు, 2వ దుకాణం పెద్ద నర్సాగౌడ్ రూ 3.13లక్షలు, 3వ దుకాణం నవీన్‌గౌడ్ రూ. 3.14లక్షలు, 4వ దుకాణం(డబ్బా) రాణమ్మ రూ. 2.30లక్షలకు వేలంపాటలో తీసుకున్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్‌లు గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సాయాగౌడ్, సాయిలు, మాజీ ఉపసర్పంచ్ కొండల్‌రెడ్డి, నాయకులు మానిక్యరెడ్డి, మధుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతన జీఓలను సవరించండి



లేబర్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

నర్సాపూర్‌రూరల్: 73వ షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ డ్రాఫ్ట్ కనీస వేతనాల జీఓలను సవరించి అన్ని వర్గాల కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేల చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నర్సాపూర్ అసిస్టెంట్ లేబర్ ఆఫీస్ సబ్‌ఆర్డినేటర్ విమలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కనీస వేతనాల చట్ట సవరణ జరిగి, 15 ఏళ్లు గడుస్తున్నా.. అమలు చేయకపోవడం విచారకరం అన్నారు. 2005 నుంచి నేటి వరకు ఆర్థికభారాలతో ఇబ్బంది పడుతున్నారు. చాలీచాలని జీతాలతో కార్మికులు ఆవేదనకు గురవుతున్నారు. 73వ షెడ్యూల్ పరిశ్రమల సవరణ చేపట్టి, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగభూషణం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఘనంగా పాఠశాల వార్షికోత్సవం**

టేక్మాల్(మెదక్): మండలంలోని కుసంగి పాఠశాల వార్షికోత్సవంలో భాగంగా బుధవారం పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. స్థానిక చైతన్య యూత్ ఆధ్వర్యంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సంగమేశ్వర్‌గౌడ్ సహకారంతో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, స్కేల్లు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎంఅశోక్ కుమార్, మాజీ జిల్లా కో–ఆప్షన్ సభ్యులు యూసూఫ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సంగమేశ్వర్ గౌడ్, మాజీ సర్పంచ్ మొగల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు రామగల్ల అంజయ్య, మాజీ ఉపసర్పంచ్ నారాయణ గౌడ్, పాఠశాల చైర్మన్ సావిత్రమ్మ, ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ప్రశాంత్, చైతన్య యూత్, అంబేద్కర్ యూత్ కార్యవర్గ సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

◆ **విఠల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం**

శివ్వంపేట(నర్సాపూర్): దివంగత నర్సాపూర్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఖాలేఖ్ అన్నారు. మండలంలోని చిన్నగొట్టిముక్ల పంచాయతీ పరిధిలోని కొత్త కాలనీ పేరుని విఠల్‌రెడ్డి కాలనీగా బుధవారం మార్పు చేశారు. ఈ సందర్భంగా ఖాలేఖ్ సీపీఐ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతిరావు, కిషన్, రాములు, లచ్చులు, తదితరులు ఉన్నారు.

◆ **కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు**

నర్సాపూర్‌రూరల్: పట్టణంలో బంప్‌యార్డు హటావో–నర్సాపూర్ బచావో అనే నినాదంతో జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారంతో 17వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో రెండోవార్డు ప్రజలతో పాటు, బీజేవైఎం నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు కూర్చున్నారు. ఈ దీక్షలో రమేశ్‌యాదవ్, అరవింద్‌గౌడ్, ప్రేమ్‌గౌడ్, ఉదయ్‌గౌడ్, రాజేశ్, అనిల్‌రాజు, వంశీతో పాటు తదితరులు పాల్గొన్నారు.

◆ **సీఆర్పీ కుటుంబాలకు ఆర్థిక సాయం**

చేగుంట(తూప్రాన్): మండల పరిదిలోని మక్కరాజీపేట సీఆర్పీలుగా పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రమేశ్, శ్రీనివాస్ కుటుంబీకులకు ఉపాధ్యాయులు రూ.2లక్షల ఆర్థిక సాయం అందించారు. గజ్వేల్ ప్రాంత పరిధిలో వివిధ మండలాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు రూ.రెండు లక్షలు సేకరించారు. సంబంధిత డబ్బులను ఇద్దరు మృతుల కుటుంబాల పిల్లల పేర్లపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి సంబంధిత పత్రాలను బాధిత కుటుంబాలకు అందించారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి, మెదక్ సిద్దిపేట జిల్లాల నాయకులు సంపత్, రాజు, సంతోష్‌రెడ్డి, వెంకటేశ్, యాదగిరి, లచ్చిరాంనాయక్, ఎల్లం, కనకయ్యలు పాల్గొన్నారు.

మోటార్లకు మరమ్మతు చేయించండి



ఎమ్మెల్యే సునీతారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న గుజిరితండా వాసులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని గుజిరి తండా వాసులు బుధవారం చండూర్ ఎత్తిపోతల ప్రాజెక్టుకు మరమ్మతులు చేయించాలని, మరో 500 మీటర్లు పైప్‌లైన్ పెంచాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డికి హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా చండూర్ ఎత్తిపోతల ప్రాజెక్ట్‌లో పలు కారణాలతో మట్టినిండి మోటార్లు, ఇన్‌టెక్ వాల్స్, ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోయాయి. ప్రాజెక్ట్‌ను మరమ్మతులు చేయిస్తే, చండూర్, గుజిరితండా శివారులో సుమారు 800 ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే సునీతారెడ్డి సానుకూలంగా స్పందించిందన్నారు. ఈ కార్యక్రమంలో గుజిరితండా మాజీ సర్పంచ్ రాకేశ్‌నాయక్, తండా వాసులు పాల్గొన్నారు.

మొదటి రోజు ఇంటర్ పరీక్ష ప్రశాంతం



చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



కౌడిపల్లి(నర్సాపూర్): పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్లు



టేక్మాల్‌లో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

కౌడిపల్లి(నర్సాపూర్): ఇంటర్మీడియట్ పరీక్ష మొదటిరోజు ప్రశాంతంగా ప్రారంభమైంది. బుధవారం కౌడిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 350 మంది విద్యార్థులకు 341మంది విద్యార్థులు హాజరుకాగా, 9 మంది గైర్హాజరు అయినట్లు పరీక్ష కేంద్రం సీఎస్ మణికాంత్‌రావు, డీఓ ప్రభాకర్ తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు బందోబస్త్ నిర్వహించారు. ఉదయం ఇన్విజిలేటర్లు విద్యార్థులను తనిఖీ చేసి, పరీక్ష కేంద్రంలోపలికి పంపించారు.

పెద్దశంకరంపేట(మెదక్): ఇంటర్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు తెలుగు, హిందీ పరీక్షలకు 192 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, ముగ్గురు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ శోభారాణి, డిపార్ట్‌మెంట్ అధికారి శ్యాంరావులు తెలిపారు.

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మోడల్ కళాశాల పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 197 మంది విద్యార్థులకు 194 మంది విద్యార్థులు హాజరు కాగా, ముగ్గురు విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేదు. మోడల్ కళాశాల పరీక్ష కేంద్రంలో 226 మంది విద్యార్థులకు 216 మంది హాజరు కాగా 10 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

ఇంటర్ పరీక్షలో ఒకరు గైర్హాజరు

టేక్మాల్(మెదక్): మండల టేక్మాల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రారంభమైన ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలో ఒకరు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ సుభాస్‌చంద్ర తెలిపారు. ఇంటర్ ఫస్టియర్ తెలుగు పరీక్షకు 216మందికి ఒకరు గైర్హాజరయినట్లు చెప్పారు.

చండీ శిఖం భూమిలో మట్టి తవ్వకాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చండీ పంచాయతీ పరిధిలోని లోతస్ చెరువులో మట్టి తవ్వకాలు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా జేసీబీలతో మట్టి తవ్వకాలు చేస్తూ ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా శిఖం భూముల్లో నుంచి మట్టి తవ్వకాలు చేస్తూ తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామ ప్రజా అవసరాల నిమిత్తం తవ్వకాలు చేస్తే వెంటనే అడ్డుకునే ఇరిగేషన్ సిబ్బంది అక్రమ తవ్వకాలు చేస్తున్నప్పటికీ స్పందించడం లేదని గ్రామస్తులు వాపోయారు. ఇష్టరాజ్యంగా తవ్వకాల వల్ల చెరువుల్లో ఏర్పడిన భారీ గుంతల వల్ల ప్రమాదాలు జరుగుతున్నా.. అధికారులు పంటించుకోవడం లేదన్నారు. ఈ విషయం గురించి ఇరిగేషన్ ఏఈ సునీత వివరణ కోరగా, చండీ గ్రామ పరిధిలోని లోతస్ చెరువులో నుంచి మట్టి తవ్వకాలకు సంబంధించి అనుమతులు ఇవ్వలేదని సిబ్బందిని పంపించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



శివ్వంపేట ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా విద్యార్థులు



చిలప్‌చెడ్(నర్సాపూర్): చిట్కుల్ పాఠశాలలో..



నర్సాపూర్‌రూరల్: నారాయణపూర్‌లో ..



కంచన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చిట్కుల్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఒక్కరోజు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించిన విద్యార్థులు, తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు.

గాజులగూడెం, ఎల్లాపూర్ పాఠశాలల్లో..

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని గాజుల గూడెం, ఎల్లాపూర్ పాఠశాలల్లో బుధవారం స్వయం పాలన దినోత్సవం జరుపుకొన్నారు. గాజుల గూడెంలో హెచ్‌ఎంగా సురక్ష, ఎంఈఓగా ఆర్మాన్, డీఈఓగా భానుప్రియ, ఎల్లాపూర్‌లో హెచ్‌ఎంగా సహస్ర, ఎంఈఓగా మనస్విని విధులు నిర్వర్తించారు.

నారాయణపూర్ ప్రాథమిక పాఠశాలలో..

నర్సాపూర్‌రూరల్: మండల పరిధిలోని నారాయణపూర్ ప్రాథమిక పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టారు. హెచ్‌ఎంగా శివరాం, ఉపాధ్యాయులుగా శివరాములు, భరత్, వర్షిత్, ఆదిత్య, అభిరామ్, చరణ్, తేజశ్రీ, గణేశ్ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవికుమార్, ఉపాధ్యాయులు కృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

శివ్వంపేట ఉన్నత పాఠశాలలో..

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు బుధవారం స్వయంపాలన దినోత్సవం జరుపుకొన్నారు. విద్యార్థులు బోధన చేయడం ద్వారా వారిలో దాగిఉన్న నైపుణ్యత వెలుగులోకి వస్తుందని హెచ్‌ఎం బాలచంద్రం అన్నారు. బోధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశామన్నారు.

కర్నాల్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో..

చేగుంట(తూప్రాన్): మండలంలోని కర్నాల్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయం పాలన జరుపుకొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



అల్లాదుర్గం(మెదక్): కేజీబీవీని తనిఖీ చేస్తున్న మండల ప్రత్యేక అధికారి కరుణాకర్

అల్లాదుర్గం(మెదక్): మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని, మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేక అధికారి కరుణాకర్ హెచ్చరించారు. బుధవారం అల్లాదుర్గం బాలికల జెడ్పీ పాఠశాల, కేజీబీవీ, బాలికల ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనం, వంటశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా వంటశాల అపరిశుభ్రంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత లేని కూరగాయాలు చూసి మండిపడ్డారు. అల్లాదుర్గం బాలుర జెడ్పీ పాఠశాలను జిల్లా సివిల్ సప్లయ్ అధికారి సురేశ్‌రెడ్డి తనిఖీ చేశారు. వంటగదిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ ధనుంజయ్య, కేజీబీవీ ప్రిన్స్‌పాల్ స్రవంతి పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పాలాట ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీఓ లక్ష్మీ నర్సయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. హెచ్‌ఎం తిరుపతి రెడ్డి, పంచాయత్ కార్యదర్శి గీత, ఉపాధ్యాయురాలు కవిత, విజయ పాల్గొన్నారు.